పాఠం 12

# యూరప్‌లో మారుతున్న సాంస్కృతిక సంప్రదాయాలు: 1300-1800

## మధ్యయుగ ప్రపంచంలో యూరప్

పురాతన కాలంలో యూరప్ రోమన్ సామ్రాజ్యం ఆధిపత్యంలో ఉన్నది. ఆ సమయంలో రోమన్లు యూరప్‌లో అధిక భాగాన్ని, టర్కీ, ఈజిప్టులను చాలాకాలం నియంత్రించారు. రోమ్, అలెగ్జాండ్రియా వంటి పట్టణాలు వెల్లివిరిశాయి. రోమ్, గ్రీసులలో సంస్కృతి – శిల్పాలు, చిత్రకళ, భవనాలు, సాహిత్యం, తత్వశాస్త్రం, విజ్ఞాన శాస్త్రం వంటివి ఎంతో ఉన్నతంగా ఉండేవి. క్రీస్తు శకం 400లలో రోమన్ సామ్రాజ్యం పతనమైన తరవాత పశ్చిమ యూరప్‌లో పెద్ద సామ్రాజ్యాలు ఏవీ లేవు. పట్టణాలు కూడా క్షీణించిపోయి ప్రజలు పల్లెల్లో నివసించసాగారు. వ్యాపారం చాలా తక్కువగా ఉండేది. ఫ్యూడలిజం అనే సామాజిక వ్యవస్థ యూరప్‌లో ఆధిపత్యం వహించసాగింది. ఫ్యూడలిజంలో రాజకీయ అధికారం సైనిక–భూస్వాముల చేతుల్లో ఉండేది. గ్రామాలను, రైతాంగాన్ని వీళ్లు నియంత్రించేవాళ్లు. రైతాంగంలో అధిక భాగం 'కట్టుబానిసలు'గా ఉండేవాళ్లు. వాళ్లు తమ యజమానుల ఆధీనంలో బందీగా వాళ్ల పొలాల్లో, కర్మాగారాలలో పనిచేయాల్సి వచ్చేది. వాళ్ల తరఫున యుద్ధాలు కూడా చేయాల్సి వచ్చేది. వీరికి సొంత భూములు కూడా ఉండేవి. వాటిని సాగుచేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాళ్ళు. ఈ భూస్వాములు తరచు ఒకరితో ఒకరు యుద్ధాలు చేస్తుండేవాళ్లు. ఫలితంగా రైతాంగం తీవ్ర అభద్రతకు గురయ్యేది. క్రైస్తవ మతాన్ని పాటించటానికి ప్రాధాన్యతనిచ్చిన రోమన్ కాథలిక్కు చర్చి ప్రజల సంస్కృతిని తీవ్రంగా ప్రభావితం చేసేది. ప్రజలను ఆలోచించవద్దని, మతగురువులు చెప్పింది నమ్మమని అది ఒత్తిడి చేసేది. పురాతన కాలపు సాంస్కృతిక సంపద అంతా విస్మరింపబడి, కనుమరుగైపోయింది.

1300 తరవాత ఈ పరిస్థితి మారసాగింది. కట్టుబానిసత్వాన్ని వ్యతిరేకించిన రైతాంగం భూస్వాముల, చర్చి నియంత్రణను వ్యతిరేకించ సాగింది. ఉదాహరణకు 1381లోని రైతాంగం తిరుగుబాటుతో ఇంగ్లాండులో కట్టుబానిసత్వం అంతమయ్యింది. ఇతర దేశాలలో కూడా ఇటువంటి ఉద్యమాలే చోటు చేసుకున్నాయి. భూస్వాముల, చర్చి ఆధిపత్యం తగ్గి ప్రజలు మరింత స్వేచ్ఛను అనుభవించసాగారు. యూరప్ దేశాలకు చైనా, అరేబియా, భారతదేశం, ఈజిప్టు వంటి వాటితో దూరప్రాంత వాణిజ్యం పునరుద్ధరింపబడసాగింది. యూరప్‌లో వ్యాపారస్తులు, చేతివృత్తి కళాకారులు నివసించే అనేక కొత్త పట్టణాలు, నగరాలు ఏర్పడ్డాయి. ఈ నగరాలలో అనేకం స్వతంత్రంగా ఉండి నగరపాలిక (స్వపరిపాలన వ్యవస్థ)ల ద్వారా స్వయం పరిపాలన కలిగి ఉండేవి.

**యూరప్ చరిత్రలోని దశలు**

| | | |
|---|---|---|
| పురాతన కాలం | : | 400 సంవత్సరం వరకు |
| మధ్య యుగం | : | 400 – 1300 సంవత్సరాలు |
| తొలి ఆధునిక కాలం | : | 1300 – 1800 సంవత్సరాలు |
| ఆధునిక యుగం | : | 1800 నుంచి ఇప్పటివరకు |

*ఇవి ఉజ్జాయింపు సంవత్సరాలని గమనించండి. వివిధ చరిత్రకారులు వివిధ సంవత్సరాలతో చరిత్ర విభజన చేశారు.*

© SCERT not to be republished

యూరప్‌లో ఒక కొత్త సాంస్కృతిక ఉద్యమం మొదలయ్యింది. దానిని పునరుజ్జీవనం లేదా పునర్జన్మ అంటారు. మతగురువులు విధించిన పరిమితులను ప్రజలు అధిగమించసాగారు. వాళ్లు కొత్త ప్రశ్నలు వేసి, వాటికి కొత్త విధాలలో సమాధానాలు కనుగొనసాగారు. కొత్త ప్రాంతాలు, కొత్త మార్గాలు కనుక్కోటానికి వ్యాపారవేత్తలు, సాహసికులు సుదీర్ఘ ప్రయాణాలపై బయలుదేరారు. చిత్రకళ, శిల్పం, ఇతర కళలు, సాహిత్యం వంటి వాటిల్లో కొత్త ధోరణులు బయలుదేరాయి. విజ్ఞాన శాస్త్రం కూడా వేగంగా వ్యాప్తి చెందింది. మత ఆధిపత్యాన్ని కూడా ప్రజలు ప్రశ్నించ సాగారు, దేవుడిని చేరుకోటానికి సులువుగా, ఇతరుల సహాయం అవసరం లేని దారుల కోసం అన్వేషించసాగారు. వీటన్నిటి గురించి ఈ అధ్యాయంలో తెలుసుకుందాం.

- ఎనిమిదవ తరగతిలో హైదరాబాదు రాజ్యంలోని జమిందారీ వ్యవస్థ, 'వెట్టి' గురించి చదివారు. యూరపులోని 'కట్టుబానిసత్వం'తో దీనిని పోల్చండి.
- పట్టణాల అభివృద్ధికి వ్యాపారం ఎలా దోహదం చేస్తుంది?
- పల్లెల్లోకంటే పట్టణాలలో కొత్త ఆలోచనలు గురించి తెలుసుకోటానికి, కొత్త విషయాలు ప్రయత్నించి చూడటానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయా? చర్చించండి.

## పునరుజ్జీవనం

యూరపు చరిత్రకు సంబంధించి అధ్యయనం చేయటానికి కావలసిన సమాచారం పద్నాల్గవ శతాబ్దంనుంచి ఎంతో అందుబాటులో ఉంది. అవి పత్రాలు, ముద్రిత పుస్తకాలు, పెయింటింగులు, శిల్పాలు, భవనాలు, వస్త్రాలు. వీటిల్లో చాలా వాటిని యూరపు, అమెరికాలలోని పురావస్తుశాలల్లో, ఆర్ట్ గ్యాలరీలలో, మ్యూజియంలలో జాగ్రత్తగా భద్రపరిచారు. ఏం జరిగిందో, అవి ఎందుకు, ఎలా జరిగాయో అధ్యయనం చేయటానికి చరిత్రకారులు వీటిని ఉపయోగిస్తారు.

ఆ కాలంలో జరిగిన సాంస్కృతిక మార్పులను వివరించటానికి చరిత్రకారులు 19వ శతాబ్దం నుంచి 'పునరుజ్జీవనం' అన్న పదాన్ని వాడుతున్నారు. స్విట్జర్లాండుకి చెందిన జాకబ్ బర్క్‌హార్ట్ (1818–97) అన్న చరిత్రకారుడు ఈ మార్పులను ఎక్కువగా ప్రస్తుతించాడు. 1860లో 'ది సివిలైజేషన్ ఆఫ్ ద రినాయ్‌సాన్స్ ఇన్ ఇటలీ' అన్న పుస్తకం రాశాడు. 14వ శతాబ్దం నుంచి 17వ శతాబ్దం వరకు ఇటలీలో ఒక కొత్త 'మానవతా' సంస్కృతి ఎలా వికసించిందో సాహిత్యం, భవన నిర్మాణం,చిత్రకళలు వంటి వాటి ద్వారా పాఠకులకు తెలియచేశాడు. మనిషి, ఒక వ్యక్తిగా, తన సొంత నిర్ణయాలు తీసుకోగలడనే, తన నైపుణ్యాలను పెంచుకోగలడనే నమ్మకం మీద ఈ కొత్త సంస్కృతి ఆధారపడిందని అతడు పేర్కొంటాడు. చర్చి ద్వారా ఆలోచనలు నియంత్రించబడిన 'మధ్యకాలం' నాటి మనిషితో పోలిస్తే ఈ మనిషి 'ఆధునికుడు'.

- బర్క్‌హార్ట్ ప్రకారం కింది వాటిలో ఏది ఆధునిక దృక్పథానికి చెందినది, ఏది మధ్యకాలం నాటికి చెందినది?
  - తెలుసుకుని, తమ నిర్ణయాలు తాము తీసుకునే సామర్థ్యంలో నమ్మకం
  - మతపర పుస్తకాలు, మతగురువులలో విశ్వాసం
  - దేవుడు అన్ని విషయాలు తెలియచేస్తాడన్న నమ్మకం
  - మానవుల హేతువాదంపై విశ్వాసం

© SCERT not to be republished

## ఇటలీ నగరాల పునరుద్ధరణ




*పటం 1: ఇటలీలోని ప్రాంతాలు*

బైజంటైన్ సామ్రాజ్యం, ఇస్లామిక్ దేశాల మధ్య వాణిజ్యంవిస్తరించటంతో ఇటలీ తీరం వెంట రేవు పట్టణాలు పునరుద్ధరింపబడ్డాయి. 12వ శతాబ్దం నుంచి చైనాతో వ్యాపారం ప్రారంభించటంతో, పశ్చిమ యూరప్ దేశాలతో కూడా వ్యాపారం పెరగటంతో ఇటలీ పట్టణాలు కీలక పాత్రపోషించసాగాయి. ఈ పట్టణాలు తమను బలమైనసామ్రాజ్యంలో భాగంగా కాకుండా స్వతంత్ర పట్టణ దేశాలుగా చూడ సాగాయి. వీటిల్లో రెండు – ఫ్లోరెన్స్, వెనిస్ గణతంత్రాలు కాగా ఇంకా ఎన్నో యువ రాజుల పాలనలోని నగర సభలుగా ఉండేవి.

బాగా వర్ధిల్లిన నగరాలలో వెనిస్ ఒకటి, జెనోవా మరొకటి. మిగిలిన యూరప్‌తో పోలిస్తే ఇవి భిన్నంగా ఉండేవి. ఇక్కడి మతగురువులు రాజకీయ ఆధిపత్యం చెలాయించేవాళ్లు కాదు. బలమైన ఫ్యూడల్ భూస్వాములు కూడా ఇక్కడ లేరు. పట్టణ పరిపాలనలో ధనిక వ్యాపారులు, బ్యాంకర్లు చురుకుగా పాల్గొనే వాళ్లు. పౌరసత్వం అన్న భావన వేళ్లూనుకోటానికి ఇది దోహద పడింది. ఈ పట్టణాలను సైనిక నియంతలు పరిపాలించిన సమయంలో కూడా పట్టణ ప్రజలలో పౌరులమన్న భావన బలహీనపడలేదు.

- ఇటలీ పటంలో గణతంత్రాలను, మూడు నగర సభలను గుర్తించండి.

**మతగురువులు** (క్లర్జీ) : చర్చికి చెందిన బోధకులు, బిషప్, కార్డినల్, పోప్

© SCERT not to be republished

## మానవతావాదం, విశ్వవిద్యాలయాలు

పురాతన గ్రీకు సాహిత్యం మానవ జీవనంలో ఆసక్తిని కల్గించింది. వాళ్లు నివసించిన ప్రపంచం వాళ్లకి చాలా కీలకమైనదిగా అనిపించింది. పురాతన గ్రీకుసాహిత్యం మనిషి స్వభావం, ఆసక్తులకు సంబంధించినది కాబట్టి దానిని అధ్యయనం చేసే విద్యార్థులను మానవతావాదులుగా పేర్కొనసాగారు. మధ్యయుగాల పండితుల మాదిరి మరణానంతరం జీవితం గురించి కాక ఈ ప్రపంచం గురించి వాళ్లు ఆసక్తి చూపేవారు. మనిషిని ఈ జీవితంలో ప్రభావితం చేసే ప్రకృతి సమస్తాన్ని, విజ్ఞాన శాస్త్రం, కళలు వంటి వాటిని మానవతావాదులు ముఖ్యమైనదిగా భావించారు.

1453లో కాన్‌స్టాంటినోపుల్‌ని కూలదోసి తూర్పు రోమను సామ్రాజ్య స్థానాన్ని టర్కీ లేదా ఒట్టోమన్ సామ్రాజ్యం తీసుకుంది. గ్రీకు మాట్లాడే అనేకమంది విద్యావంతులు తమ భద్రతకోసం ఇటలీ పారిపోయారు. వీళ్లల్లో కొంతమంది తమతోపాటు తమ గ్రీకు పుస్తకాలు తెచ్చుకున్నారు. దీంతో పురాతన గ్రీకుసాహిత్యం, గ్రీకు భాష పట్ల ఇటలీ ప్రజలకు ఆసక్తి కలిగింది. ఆ రోజుల్లో ఇటలీలో కొంచెం గ్రీకుభాష వచ్చి ఉండటం గొప్పగా భావించేవాళ్లు.

మానవతావాదం ఇటలీలో మొదలయిన కొంతకాలానికే ఫ్రాన్స్, ఇంగ్లాండు, నెదర్‌లాండ్స్‌లకు విస్తరించింది. కొత్త విషయాలు, చట్టం, మతం వంటి వాటిని బోధించటానికి విశ్వవిద్యాలయాలను స్థాపించారు. విద్యావంతులు ఈ విషయాల పట్ల ఆసక్తి కనపరచసాగారు. వీళ్లల్లో డచ్ దేశస్థుడైన ఎరాస్మస్ (1466–1536) గొప్ప పండితుల్లో ఒకడు. కొత్త నిబంధనను, దాని మూలమైన గ్రీకుభాషలో, ఇతర తొలి గ్రీకు క్రైస్తవుల రచనలను అతడు చదివాడు. అతడు రాసిన **'ప్రైయిస్ ఆఫ్ ఫాలీ'** అన్న పుస్తకంలో మూఢనమ్మకాలపై ఆధారపడిన కొన్ని చర్చి ఆచారాలను అతడు విమర్శించాడు. పునరుజ్జీవన కాలంలో మానవతావాద పండితులు అరబ్బులనుంచి పొందిన పుస్తకాలను తిరిగి గ్రీకు, లాటిన్ భాషలలోకి అనువదించి వాటిని అధ్యయనం చేశారు.

- మానవతావాదులు ఎవరు? వారు ఏమి బోధించారు?

## కళాకారులు, యదార్థవాదం

మానవతావాద భావాలు కళలకు, వాస్తుశిల్పానికి కూడా విస్తరించాయి. చిత్రకళ, శిల్పకళ వంటి దృశ్య కళలలో ఇది 'యదార్థవాద' రూపాన్ని తీసుకుంది. కళాకారులు తమ చుట్టుపక్కల ప్రకృతిని, ప్రజలను, ప్రదేశాలను పరిశీలించి వాటిని యధాతథంగా చిత్రీకరించటానికి ప్రయత్నించారు. ఫ్యూడల్ కాలంలో చర్చి ప్రోత్సహించిన మతపరమైన కళల కంటే ఇది ఎంతో భిన్నమైనది. మత సంబంధమైన దృశ్యాలను, కొన్ని ఆదర్శరూపాలకు అనుగుణంగా మనుషులను చిత్రీకరించడానికి మతపర కళలు ప్రాధాన్యతనిచ్చాయి. కళలు తమ చుట్టుపక్కల వాటిని కాకుండా ఆ ఆదర్శాలను ప్రతిబింబించాలని మతపర కళలు భావించాయి. పునరుజ్జీవ కళాకారులు తమ చుట్టుపక్కల అంశాలను, మానవుల భావనలు, బలాన్ని, శక్తిని వ్యక్తపరిచిన గ్రీకు, రోమన్ సాహిత్యంలోని అంశాలను చిత్రీకరించసాగారు. ఈ ధోరణి వల్ల మానవుల, ప్రకృతి వాస్తవ ప్రపంచాన్ని అధ్యయనం చేయసాగారు.

రోమన్ సంస్కృతి అవశేషాలైన భవనాలు, శిల్పాలు వంటి వాటిని కూడా కళాకారులు అధ్యయనం చేయసాగారు. కొన్ని వందల సంవత్సరాల క్రితం స్త్రీ, పురుషుల శిల్పాలను అంత ఖచ్చితంగా చేయగలిగిన నైపుణ్యాన్ని మెచ్చుకుంటూ, ఇటలీ శిల్పులు ఆ సంప్రదాయాన్ని కొనసాగించాలని అనుకున్నారు. 1416లో డొనాటెల్లో (1386–1466) వాస్తవ పరిమాణంలో శిల్పాలు చెక్కి కొత్త దారి చూపించారు.

© SCERT not to be republished

ఖచ్చితంగా ఉండాలన్న కళాకారుల ప్రయత్నానికి శాస్త్రజ్ఞుల కృషి తోడ్పడింది. ఎముకల నిర్మాణాల గురించి అధ్యయనం చేయటానికి వైద్యశాస్త్ర ప్రయోగశాలలకు కళాకారులు వెళ్లే వాళ్లు. పడువా విశ్వవిద్యాలయంలో వైద్య ఆచార్యుడైన బెల్జియంకి చెందిన ఆండ్రియాస్ వెసాలియస్ (1514-64)



"కళ" ప్రకృతిలో ఇమిడి ఉంది; దానిని వెలికి తీయగలిగిన వాళ్లకు అది అందుతుంది... జీవితానికి ఎంత దగ్గరగా మీ కళ ఉంటే అది అంత బాగా ఉంటుంది... ఏ వ్యక్తి తన ఊహ ద్వారా అందమైన బొమ్మను వేయలేడు. జీవితం నుంచి అధ్యయనం చేసింది మెదడులో బాగా ముద్రించుకుని ఉంటే తప్ప. - అల్బ్రెక్ట్ డ్యురర్ (1471-1528)

***'ప్రార్థించే చేతులు' అన్న పేరుతో డ్యురర్ వేసిన ఈ బొమ్మ 16వ శతాబ్దపు ఇటలీ సంస్కృతిని తెలియచేస్తుంది. అప్పుడు మనుషులు మతం పట్ల పూర్తి విశ్వాసంతో ఉన్నప్పటికీ పరిపూర్ణత సాధించటంలో, విశ్వ, ప్రపంచ మర్మాల గుట్టును విప్పటంలో మానవ శక్తి, సామర్థ్యాలపై పూర్తి నమ్మకం ఉండేది.***



*చిత్రం 12.1: మైఖెలెంజిలో శిల్పం 'పైటా' (జాలి); జీసస్ శరీరాన్ని వడిలో పెట్టుకున్న మేరీ.*

లోపలి శరీర భాగాలను, వ్యవస్థలను అధ్యయనం చేయటానికి మనిషి శరీరాన్ని కోసిన మొదటివ్యక్తి. శరీర ధర్మశాస్త్ర (శరీర భాగాలను, వ్యవస్థలను అధ్యయనంచేసే) ఆధునిక అధ్యయనానికి ఇది నాంది పలికింది. తమ బొమ్మలు, శిల్పాలు వాస్తవికంగా ఉండేలా చేయటానికి లియొనార్డొ డావిన్సి వంటి కళాకారులు శరీర నిర్మాణ శాస్త్రాన్ని అధ్యయనం చేశారు.

దూరంలోని దృశ్యాలను చిత్రీకరించటానికి రేఖాగణిత జ్ఞానం ఉపయోగపడుతుందని చిత్రకారులు తెలుసుకున్నారు. అదేవిధంగా కాంతిలో మార్పుల ద్వారా తమ చిత్రాలలో పొడవు, వెడల్పే కాకుండా లోతులను కూడా చూపించవచ్చని తెలుసుకున్నారు.

**దృగ్గోచరం:** చిత్రంలో లోతుకూడా తెలిసేటట్లు చిత్రించే విధానం. దగ్గరగా ఉన్నవాటిని పెద్దగానూ, దూరంగా ఉన్న వాటిని చిన్నగానూ చూపించటం.

బొమ్మలు వేయటానికి ఆయిల్ పెయింట్లను ఉపయోగించటం తో అంతకు ముందు సాధ్యంకాని ప్రకాశవంత మైన రంగులు ఇప్పుడు సాధ్యమయ్యాయి. అనేక చిత్రాలలోని బట్టలు, వాటి రంగులలో చైనా, పర్షియన్ చిత్రకళ ప్రభావం స్పష్టంగా కనపడేది. ఈ విధంగా శరీర నిర్మాణశాస్త్రం, రేఖాగణితం, భౌతిక శాస్త్రాలతోపాటు అందానికి సంబంధించిన బలమైన భావన ఇటలీ కళలకు ఒక ప్రత్యేకత సమకూర్చింది. దీనిని 'యదార్థవాదం' గా వ్యవహరించసాగారు. ఈ ధోరణి 19వ శతాబ్దం వరకు కొనసాగింది.

చర్చికూడా ఇప్పుడు ఈ కొత్త కళలను ప్రోత్సహించ సాగింది. పోపు, చర్చికి సంబంధించిన ఇతర గురువులు ప్రముఖ కళాకారులైన మైఖెలెంజిలో, రాఫేల్ వంటి వాళ్లతో బొమ్మలు వేయించుకున్నారు. భవనాల డిజైన్ వేయించుకున్నారు. తమ సమాధులు, స్మారక చిహ్నాలు తయారు చేయించుకున్నారు.


మోనాలిసా

లియొనార్డో డా విన్సి (1452–1519) కి వృక్షశాస్త్రం, శరీర నిర్మాణశాస్త్రాల నుంచి గణితం, కళల వరకు అనేక ఆశ్చర్యకర విషయాలలో ఆసక్తి కనబరిచేవాడు. అతడు మోనాలిసా, 'ది లాస్ట్ సప్పర్' అన్న బొమ్మలు వేశాడు. ఎగరగలగటం అన్నది అతడి కలల్లో ఒకటి. ఎగురుతున్న పక్షులను సంవత్సరాల తరబడి పరిశీలించి ఎగిరే యంత్రం నమూనాని తయారు చేశాడు. అతడు 'లియొనార్డొ డా విన్సి, ప్రయోగాల శిష్యుడు' అని తన సంతకం చేసేవాడు.

## వాస్తు శిల్పం

15వ శతాబ్దంలో రోము నగరం అద్భుతంగా పునరుద్ధరింపబడింది. రోము చరిత్రను అధ్యయనం చేయటాన్ని పోపు ప్రోత్సహించాడు. పాత రోమన్ శైలిని పునరుద్ధరించటానికి రోమన్ కాలపు భవనాల శిధిలాలను అధ్యయనం చేయసాగారు. భవనాలలో పొడవాటి స్తంభాలు, కమానులు, గుండ్రటి పైకప్పులను రోమన్లు ఉపయోగించారు. భవన నిర్మాణంలో ఇది ఒక 'కొత్త' శైలికి దారితీసింది. వాస్తవానికి ఇది పురాతన రోమన్ శైలి పునరుద్ధరణ మాత్రమే. ఇప్పుడు దీనిని 'క్లాసికల్' (సాంప్రదాయం) గా వ్యవహరిస్తున్నారు. మతగురువులు, ధనిక వ్యాపారస్తులు, కులీన వర్గాల వాళ్లు ఈ రకమైన భవన నిర్మాణంతో పరిచయమున్న భవన నిర్మాతలతో ఇళ్లు కట్టించుకోసాగారు. కళాకారులు, శిల్పులు భవనాలను చిత్రాలు, శిల్పాలతో అలంకరించసాగారు. ఈ కాలంలో మరొక ముఖ్యమైన మార్పు అంతకు ముందు కాలంలో మాదిరి కళాకారులు వాళ్లు సభ్యులైన బృందం పేరుతో కాకుండా వ్యక్తిగతంగా వాళ్ల పేరుతో ప్రసిద్ధి చెందసాగారు.


*చిత్రం 12.2: రోమ్‌లోని సేంట్ పీటర్స్ ఆవరణ, బాసిల్కా. ఎదురుగా ఉన్న చర్చి, న్యాయస్థానాన్ని మైఖెలెంజిలో, బెర్నినితో సహా చాలామంది కళాకారులు వీటిని రూపొందించారు, అలంకరించారు. పురాతన రోము కాలంనాటి అనేక భవన నిర్మాణ శైలులను ఇక్కడ ఉపయోగించుకున్నారు.*

కొంతమంది చిత్రకళ, శిల్పం, భవన నిర్మాణం వంటి అనేక విషయాల్లో నైపుణ్యం కలిగి ఉండే వాళ్లు. వీళ్లల్లో చెప్పుకోదగిన వాడు మైఖెలెంజిలో (1475–1564). రోములో పోపుకోసం సిస్టైన్ ఛాపెల్‌లో పైకప్పు మీద వేసిన బొమ్మ, 'పైటా' అనే శిల్పం, సేంట్ పీటర్స్ చర్చికి గుండ్రటి పైకప్పు వంటి సృజనలతో అతడు అమరుడయ్యాడు.

- 16వ శతాబ్దపు ఇటలీ కళాకారులు తమ పనులలో ఉపయోగించుకున్న వివిధ శాస్త్రీయ అంశాలను వివరించండి.

© SCERT Not to be republished

ఫ్లోరెన్స్‌లోని అద్భుతమైన ద్యుమో రూపొందించిన ఫిలిప్పో బ్రూనెల్లెస్చి (1337-1446) మొదట శిల్పాకారుడుగా పనిచేశాడు. 16వ శతాబ్దంలోని ఇటలీ భవన నిర్మాణం పురాతన రోము భవనాల నుంచి అనేక ప్రత్యేక లక్షణాలను అనుకరించడం జరిగింది.

## అచ్చు యంత్రం



జోహాన్స్ గుటెన్‌బర్గ్

ఇతర దేశాల ప్రజలు గొప్ప కళాకారుల చిత్రకళ, శిల్పాలు, భవనాలు చూడాలంటే ఇటలీ వెళ్లాల్సి వచ్చేది. అయితే రాసిన వాటి విషయానికి వస్తే ఇటలీలో రాసినవి ఇతర దేశాలకు వెళ్లాయి. ముద్రణ సాంకేతిక విజ్ఞానంపై పట్టు సాధించటం 16వ శతాబ్దపు మహా విప్లవం. దీనికి యూరపు ప్రజలు మొదటగా కాగితాన్ని కనుగొన్న, అచ్చులతో ముద్రణ చేసిన చైనీయులకు రుణపడి ఉంటారు.

అంతకు ముందు చేతితో రాసిన ప్రతులు కొంతమంది చేతుల్లోనే ఉండేవి. 1455లో జోహాన్స్ గుటెన్‌బర్గ్ (1400-1458) కార్యశాలలో బైబిలు 150 ప్రతులను ముద్రించారు. ఇతడు మొదటి ముద్రణా యంత్రాన్ని తయారుచేసిన జర్మనీ దేశస్థుడు. అంతకుముందు బైబిలు ఒక ప్రతిని చేతితో రాయటానికి పట్టే సమయంలో ఇప్పుడు 150 ప్రతులు ముద్రించగలిగారు.


1500 నాటికి పురాతన పుస్తకాలన్నింటినీ (ఇవి అన్నీ దాదాపుగా లాటిన్‌లోనే ఉన్నాయి) ఇటలీలో ముద్రించారు. అచ్చు అయిన పుస్తకాలను కొనుక్కోవడంతో విద్యార్థులు కేవలం ఉపన్యాస వివరణలపైఆధారపడవలసిన అవసరం లేకుండా పోయింది. అంతకు ముందెన్నడూ లేనంతగా భావాలు, అభిప్రాయాలు, సమాచారం విస్తారంగా వ్యాపించాయి. కొత్త భావాలను ప్రచారం చేసే ముద్రిత పుస్తకం వెంటనే వందలాది పాఠకులను చేరుకోగలిగేది. సొంతంగా ఒక ప్రతిని కొనుక్కోగలిగినందువల్ల వ్యక్తులు కూడా పుస్తకాలు చదవసాగారు. నిదానంగా ప్రజలలో చదివే అలవాటు పెరిగింది. ఇటలీ మానవతావాద సంస్కృతి ఉత్తర, పశ్చిమ యూరపులో 15వ శతాబ్దం అంతం నాటికి వేగంగా వ్యాపించటానికి ముద్రిత పుస్తకాలు అందుబాటులో ఉండటం ప్రధాన కారణం. అంతకు ముందు కాలంలో వేధోపరమైన ఉద్యమాలు కొన్ని ప్రాంతాలకే ఎందుకు పరిమిత మయ్యాయో ఇది వివరిస్తుంది.

- అదే కాలములో భారతదేశంలో ముద్రణా యంత్రం లేదు. శ్రీ కృష్ణ దేవరాయలు ఒక పుస్తకం రాసాడని అనుకుందాం. వివిధ ప్రాంతాలలోని పండితులకు అది ఎలా అందేది?
- రాజులు, మతగురువులు ముద్రణ యంత్రం పట్ల ఎలా స్పందించి ఉంటారు? దానిని స్వాగతించి ఉంటారా లేక ఆందోళన చెంది ఉంటారా?

## మానవ జీవులకు సంబంధించి కొత్త అవగాహన

మానవతావాద సంస్కృతిలోని ఒక అంశం మానవ జీవితాలపై మతం నియంత్రణ బలహీనమవ్వటం. భౌతిక సంపద, అధికారం, కీర్తి పట్ల ఇటలీ ప్రజలు బలంగా ఆకర్షింపబడ్డారు. అంతమాత్రంచేత వాళ్లు మతాన్ని వ్యతిరేకించారని కాదు. అధికారం, సంపద, భౌతిక సుఖాలు వంటివి కోరుకోదగినవే కాని త్యజించవలసిన అవసరం లేదని వాళ్లు భావించసాగారు.

ఈ సమయంలో సత్ప్రవర్తనపై ఎక్కువ శ్రద్ధ కనపరచసాగారు. మర్యాదగా ఎలా మాట్లాడాలి, సరైన వస్త్రధారణ ఎలా ఉండాలి, సంస్కారవంతుడైన వ్యక్తి ఏ నైపుణ్యాలు అలవరచుకోవాలి వంటి వాటికి ప్రాధాన్యతనిచ్చారు. మానవతావాదం వల్ల డబ్బు, అధికారం సంపాదించటం ద్వారా మాత్రమే కాకుండా ఇతరత్రా తమ జీవితాలను మలచుకునే సామర్థ్యం మనుషులకుందని నమ్మసాగారు. మానవ స్వభావం బహుముఖమైనది అన్న విశ్వాసంతో ఈ భావన ముడిపడి ఉంది.


మైఖెలెంజిలో తయారుచేసిన డేవిడ్ శిల్పం

నికోలో మాకియవెల్లి పాలకుల కోసం రాజకీయాలపై ఒక పుస్తకం రాశాడు. పాలకులకు పాలనకు సంబంధించి, మతపర ఆదర్శాల గురించి అతడు సలహాలు ఇవ్వలేదు. సమాజంలో నిజమైన రాజకీయాలు ఎలా పనిచేస్తాయొ వివరించాడు. నిజమైన మనుషులను, వాళ్ల వాస్తవిక రాజకీయ జీవితాలను అతడు అధ్యయనం చేశాడు.

- పునరుజ్జీవనాన్ని కొత్త యుగం అనికూడా అంటారు. సుఖాలను కోరుకోవటం, సంపద, భోగాలను ఆశించటం, స్వార్థ ప్రయోజనంతో పనిచేయటం సరైనవేనని ప్రజలు భావించసాగారు. స్వార్థప్రయోజనాలను వ్యతిరేకిస్తూ, సంపద, సుఖాలను త్యజించాలంటూ ఉండే మత బోధనలకు ఇది విరుద్ధంగా ఉంది. పునరుజ్జీవన మానవతావాదులకున్న ఈ దృక్పథంతో మీరు ఏకీభవిస్తారా?

మాకియవెల్లి వంటి పండితులు ఆదర్శ సమాజం ఎలా ఉండాలో చెప్పటం కాకుండా మానవ సమాజం ఎలా ఉందో అధ్యయనం చేయటం మొదలుపెట్టారు. మనుషులు సొంత ప్రయోజనంతో ప్రేరణ పొందుతారన్న భావన వాళ్లకి ఉండటంతో ప్రజల స్వార్థ ప్రయోజనాల గురించి, దానిని ఉపయోగించుకునే విధానాల గురించి అధ్యయనం చేయసాగారు.

## మహిళల ఆకాంక్షలు

వ్యక్తిత్వం, పౌరసత్వం అన్న కొత్త భావనలు మహిళలను విస్మరించాయి. కులీన కుటుంబాల పురుషులు ప్రజా జీవనంలో ముఖ్యపాత్ర పోషించేవాళ్లు. తమ కుటుంబాలలో వాళ్లే నిర్ణయాలు తీసుకునేవాళ్లు. కుటుంబ వ్యాపారాలలో, ప్రజా జీవనంలో తమకు వారసులుగా తమ కొడుకులకు చదువు చెప్పించేవాళ్లు. కొన్ని సందర్భాలలో చిన్న కొడుకులను చర్చిలో చేర్పించేవాళ్లు. మహిళలు తెచ్చిన కట్నాన్ని కుటుంబ వ్యాపారంలో ఉపయోగించుకునేవాళ్లు. కానీ తమ భర్తలు ఆ వ్యాపారాలను ఎలా నడపాలన్నదానితో వాళ్లకు సంబంధం లేదు. వ్యాపార సంబంధాలను బలోపేతం చేసుకోటానికి వివాహాలు తరచు ఉపయోగపడేవి. కూతుళ్ల పెళ్లికి చాలినంత కట్నం సమకూర్చలేకపోతే అవివాహితగా దేవునికి అంకితమైన జీవనాన్ని గడపటానికి వారిని కొన్నిసార్లు కాన్వెంట్లకు పంపించేవాళ్లు. ప్రజా జీవనంలో మహిళల పాత్ర పరిమితంగా ఉండేది. గృహ సంరక్షకులుగానే వాళ్లను చూసేవాళ్లు.

అయితే వ్యాపార కుటుంబాలలోని మహిళల పాత్ర కొంత తేడాగా ఉండేది. దుకాణదారులకు దుకాణం నడపటంలో వాళ్ల భార్యల సహకారం ఉండేది. కుటుంబంలోని పురుషులు ఇతర పనుల మీద బయటకు వెళ్లినప్పుడు వ్యాపార, బ్యాంకర్ల కుటుంబాల్లో భార్యలు వ్యాపారాలను చూసుకునే

వాళ్లు. ఒక వ్యాపారి చిన్న వయస్సులోనే చనిపోతే అతని భార్య ప్రజా జీవనంలో అతడి పాత్ర పోషించేది. కులీన వర్గాల కుటుంబాల పరిస్థితి ఇలా ఉండేది కాదు.

మానవతావాద విద్య ప్రాముఖ్యత పట్ల కొంతమంది మహిళలు మేధోపరంగా ఎంతో సృజనాత్మకంగా, సున్నితత్వంతో ఉండేవాళ్లు. 'సాహిత్య అధ్యయనం వల్ల మహిళలకు ఎటువంటి లాభం, గౌరవం లభించకపోయినప్పటికీ ప్రతి ఒక్క మహిళ వీటిని తప్పనిసరిగా చదవాలి,' అని వెనీసుకు చెందిన కాస్టాండ్ర ఫెడీల్ (1465-1558) రాసింది. మానవతావాద పండితుల లక్షణాలను అందుకునే సామర్థ్యం మహిళలకు లేదన్న భావనను ప్రశ్నించిన మహిళల్లో ఆమె ఒకరు. గ్రీకు, లాటిన్ భాషలలో ప్రావీణ్యతకు ఫెడీల్ ప్రఖ్యాతి గాంచింది. పడువా విశ్వ విద్యాలయంలో ఉపన్యాసాలు ఇవ్వమని ఆమెకు ఆహ్వానాలు వచ్చేవి.


ఇసాబెల్లా డి ఎస్టె

ఆ కాలంలో చదువుకు ఉన్న గౌరవాన్ని ఫెడీల్ రచనలు చాటాయి. 'స్వేచ్ఛ అంటే చాలా పరిమితమైన నిర్వచనాన్ని ఇచ్చి, స్త్రీల అభిప్రాయాలకంటే పురుషుల అభిప్రాయాలకు ప్రాధాన్యత నిచ్చినందుకు' గణతంత్రాన్ని విమర్శించిన వెనీసు మహిళా రచయిత్రులలో ఆమె ఒకరు.

మరొక చెప్పుకోదగ్గ మహిళ మాంచెసా ఆఫ్ మంటువా గా పిలవబడే ఇసాబెల్లా డి ఎస్టె (1474-1539). భర్త లేని సమయంలో ఆమె దేశాన్ని పరిపాలించింది. చిన్న దేశమైన మంటువాలోని సభ మేథోప్రతిభకి ప్రఖ్యాతి గాంచింది. పురుషాధిపత్య ప్రపంచంలో తాము గుర్తింపు పొందాలంటే తమకూ విద్య, ఆస్తి, ఆర్థికశక్తి ఉండాలన్న దృఢాభిప్రాయాన్ని మహిళల రచనలు వ్యక్తపరిచాయి.

- ఆ కాలం మహిళలు గ్రీకు, రోమన్ పుస్తకాలు చదివినందువల్ల ఏ ప్రయోజనం పొందారు?

## క్రైస్తవ మతంలో చర్చలు (సంస్కరణలు)

వ్యాపారం, ప్రయాణాలు, సైనిక విజయాలు, దౌత్య సంబంధాల వల్ల ఇటలీ పట్టణాలకు, వాటి సభలకు బయటి ప్రపంచంతో సంబంధాలు ఏర్పడ్డాయి. విద్యావంతులు, సంపన్నులు ఈ కొత్త సంస్కృతిని ప్రశంసించి అనుకరించే వాళ్లు. చదవటం, రాయటం రాని సాధారణ ప్రజలకు ఈ కొత్త భావాలు అంతగా చేరలేదు.

మధ్య యుగాలలో ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక జీవితాన్ని చర్చి శాసించేదని ఇంతకు ముందు మీరు తెలుసుకున్నారు. ఈ ప్రక్రియలో చర్చికి అపార అధికారం, సంపద సమకూరింది. అది అవినీతిమయం కూడా అయ్యింది. మానవతావాద పండితులు దీనిని ఖండించసాగారు. మతగురువుల అవసరాన్ని, క్రైస్తవ మతానికి వాళ్ల వ్యాఖ్యానాన్ని ప్రశ్నించసాగారు.

15వ శతాబ్దం, 16వ శతాబ్ది ఆరంభంలో ఉత్తర యూరపులోని విశ్వవిద్యాలయ పండితులు, చర్చి సభ్యులు కూడా మానవతావాద భావాల పట్ల ఆకర్షితులయ్యారు. తమ తోటి ఇటలీవాసుల మాదిరి

వాళ్లు కూడా పురాతన గ్రీకు, రోము, క్రైస్తవ పవిత్ర గ్రంథాలను, ఇతర పుస్తకాలను చదివారు. ఉత్తరాది దేశాలలో చర్చిలోని మానవతావాద సభ్యులు తమ పురాతన మత గ్రంథాలలో పేర్కొన్న విధంగా మతాన్ని ఆచరించమని క్రైస్తవులను కోరారు. సాధారణ మతానికి అనవసర ఆచారాలను తరవాత జోడించారని ఖండిస్తూ వాటిని త్యజించమని చెప్పారు. మానవులు స్వేచ్ఛ, హేతుబద్ధ జీవులన్న కొత్త, పూర్తి భిన్నమైన అభిప్రాయం వాళ్లకు ఉండేది. ఆ తరవాత కాలంలోని తత్వవేత్తలు దీనినే మళ్లీ, మళ్లీ ప్రస్తావించసాగారు. ఎక్కడో ఉన్న దేవుడు మనిషిని సృష్టించాడని, 'ఇక్కడ, ఇప్పుడు' ఆనందాన్వేషణలో జీవితాన్ని స్వేచ్ఛగా బతకమన్నాడని వాళ్లు విశ్వసించారు. ఇంగ్లాండులోని థామస్ మూర్ (1478-1535), హాలండ్‌లోని ఎరాస్మస్ (1466-1536) వంటి క్రైస్తవ మానవతావాదులు చర్చి దురాశతో కూడిన వ్యవస్థగా మారిందని, సాధారణ ప్రజలనుంచి తమ చిత్తం వచ్చినట్లు డబ్బులు వసూలు చేస్తోందని విమర్శించారు. మతగురువులు బాగా వాడుకున్న పద్ధతుల్లో 'పాపపరిహార పత్రాలు' అమ్మటం ఒకటి. ఈ పత్రాలను కొనుక్కున్న వాళ్లు తాము చేసిన పాపభారం నుంచి విముక్తమౌతారని చెప్పేవాళ్లు. ప్రాంతీయ భాషలలో ప్రచురించిన బైబిలు అనువాదాలను చదివిన ప్రజలు తమ మతం ఇటువంటి పద్ధతులను అనుమతించలేదన్న విషయాన్ని గుర్తించారు.


హెూల్బైన్ ఎరాస్మస్

| ***16, 17వ శతాబ్దాలు*** | | | |
|---|---|---|---|
| 1516 | థామస్ మూర్ రాసిన 'యుటోపియా' ప్రచురితం | 1569 | భూమి స్తంభాకార పటాన్ని గెర్హార్డస్ మెర్కేటర్ తయారుచేశాడు |
| 1517 | మార్టిన్ లూథర్ తొంభైఅయిదు సిద్ధాంతాలను రాశాడు | 1582 | పోపు గ్రెగరీ XIII గ్రెగోరియన్ క్యాలెండరును ప్రవేశపెట్టాడు |
| 1522 | బైబిలును జర్మను భాషలోకి లూథర్ అనువదించాడు | 1628 | గుండెకీ, రక్త ప్రసరణకీ మధ్య సంబంధాన్ని విలియం హార్వే కనుక్కున్నాడు |
| 1525 | జర్మనీలో రైతాంగ తిరుగుబాటు | 1673 | పారిస్‌లో విజ్ఞాన శాస్త్రాల అకాడమీ ఏర్పాటయ్యింది |
| 1543 | 'శరీర నిర్మాణ శాస్త్రం' అన్న పుస్తకాన్ని ఆండ్రియాస్ వెసాలియస్ రాశాడు | 1687 | ఐజాక్ న్యూటన్ రాసిన 'ప్రిన్సిపియా మాథెమాటికా' ప్రచురితం అయ్యింది. |
| 1559 | రాజు/ రాణి అధిపతిగా ఇంగ్లాండులో ఆంగ్లికన్ చర్చి ఏర్పాటు | | |

దాదాపుగా యూరపు అంతటా చర్చి విధించిన పన్నులపై రైతాంగం తిరుగుబాటు చేసింది. మతగురువుల బలవంతపు వసూళ్లను సాధారణ ప్రజలు వ్యతిరేకించగా, ప్రభుత్వ పాలనలో వాళ్ల జోక్యం రాజులకు చికాకు కలిగించసాగింది.

1517లో మార్టిన్ లూథర్ (1483-1546) అనే యువ మతగురువు కాథలిక్కు చర్చికి వ్యతిరేకంగా ప్రచారోద్యమం మొదలుపెట్టాడు. దేవునితో సంబంధం ఏర్పరచుకోటానికి మతగురువు అవసరంలేదని అతడు ప్రచారం చేయసాగాడు. తన అనుచరులను దేవునిలో పూర్తి విశ్వాసముంచమని, విశ్వాసం ఒక్కటే సరైన జీవనం, స్వర్గ ప్రవేశం కల్పించగలదని అతడు చెప్పేవాడు. ఈ ఉద్యమాన్ని ప్రొటెస్టెంట్ సంస్కరణ వాదంగా వ్యవహరిస్తారు. దీని ఫలితంగా జర్మనీ, స్విట్జర్లాండ్‌లలోని చర్చిలు పోపుతో,

© SCERT not to be republished

కాథలిక్కు చర్చితో సంబంధాలు తెంచేసుకున్నాయి. స్విట్జర్‌లాండ్‌లో ఉల్రిచ్ జ్వింగ్లి (1484–1531), ఆ తరవాత జాన్ కాల్విన్ (1509–1564) లూథర్ భావాలను ప్రచారం చేశారు. వ్యాపారస్తుల మద్దతుతో సంస్కరణవాదులు పట్టణాల్లో ప్రజాదరణను పొందగా, గ్రామీణ ప్రాంతాల్లో కాథలిక్కు చర్చి ప్రభావం కొనసాగింది. అనాబాప్టిస్టుల వంటి ఇతర జర్మన్ సంస్కర్తలు మరింత తీవ్రవాద మార్గాన్ని అనుసరించారు. అన్ని రూపాలలో సామాజిక అణచివేతను అంతమొందించటాన్నీ, నిర్వాణ భావననూ వాళ్లు ఏకం చేశారు. దేవుడు అందరినీ సమానులుగా సృష్టించాడు కాబట్టి ఎవరూ పన్నులు కట్టనవసరంలేదని, తమ మతగురువును ఎంచుకునే హక్కు ప్రజలకుందని వాళ్లు ప్రచారం చేయసాగారు. ఫ్యూడలిజంలో అణచివేతకు గురైన రైతాంగం ఈ భావనలను ఆదరించింది.

బైబిలుని ప్రజల భాషలలోకి అనువాదం చేసి, వాటిని ముద్రించి ప్రజలందరికి అందుబాటులో ఉండేలా చేయటం సంస్కర్తలు సాధించిన ముఖ్యమైన వాటిల్లో ఒకటి. అంతకు ముందు బైబిలు లాటిన్‌లో మాత్రమే ఉండి సామాన్య ప్రజలకు అర్థమయ్యేది కాదు.

జర్మనీ, హాలాండ్, ఫ్రాన్స్, ఇంగ్లాండులలో చాలామంది ప్రజలు సంస్కరణ భావనల పట్ల ఆకర్షితులయ్యారు. ఈ దేశాలన్నింటిలో క్రైస్తవ మతాన్ని రకరకాలుగా వ్యాఖ్యానించి వాటిద్వారా అనేక విశ్వాసాలు రూపొందాయి. ఆ విధంగా కాథలిక్కు చర్చి గుత్తాధిపత్యం విచ్ఛిన్నమైపోయింది.

కాథలిక్కు చర్చి సైతం ఈ భావనల ప్రభావం నుంచి తప్పించుకోలేకపోయింది. దానిలోకూడ అంతర్గత సంస్కరణలు మొదలయ్యాయి. స్పెయిన్, ఇటలీలలో మతగురువులు సాధారణ జీవితానికి, పేదలకు సేవ చేయటం వంటి వాటికి ప్రాధాన్యతను ఇవ్వసాగారు. స్పెయిన్‌లో ప్రొటెస్టెంట్ మతాన్ని ఎదుర్కోటానికి ఇగ్నేషియస్ లయోలా 1540లో సొసైటి ఆఫ్ జీసస్‌ని స్థాపించాడు. అతడి అనుచరులను జెస్యూట్లు అంటారు. పేదలకు సేవ చేయటం, ఇతర సంస్కృతులకు సంబంధించి తమ జ్ఞానాన్ని విస్తృతపరచటానికి వాళ్లు తమ జీవితాలను అంకితం చేయసాగారు.

- కాథలిక్కు చర్చిని ఏ అంశాలలో ప్రొటెస్టెంటులు విమర్శించారు?
- భారతదేశంలోని భక్తి ఉద్యమానికి, ప్రొటెస్టెంటు ఉద్యమానికి మధ్య ఏమైనా పోలికలు ఉన్నాయా? ఆ రెండింటి మధ్య తేడాలు ఏమైనా ఉన్నాయా?

## ఆధునిక విజ్ఞాన శాస్త్రాల ఆరంభం

తరతరాల నుంచి వస్తున్న జ్ఞానాన్నే మధ్యయుగాలలో ప్రజలు ఆమోదించసాగారు. చాలామంది తాము నివసిస్తున్న ప్రపంచాన్ని అన్వేషించటంలో ఆసక్తి కనపరిచేవాళ్లు కాదు. అలాంటి ఆసక్తి ఉన్న వాళ్లలో చాలామంది మూఢనమ్మకం, మాయాజాలాలను కలిపి చూసేవాళ్లు. అయితే రోజర్ బాకన్ సత్యాన్ని తీవ్రంగా అన్వేషించిన వాళ్లలో ఒకడు. అతడు లోహాలు, రసాయనాలతో అనేక ప్రయోగాలు చేసేవాడు. అతడి దగ్గర మోటు సూక్ష్మదర్శిని కూడా ఉండేది. ఆ తరవాత కాలంలో ఆవిరి ఓడలు, మోటారు వాహనాలు, విమానాల వంటి ఆవిష్కరణలలో ఉపయోగపడిన ఎన్నో సిద్ధాంతాలను అతడు ప్రతిపాదించాడు. బాకన్ ఎంతగా కృషి చేసినప్పటికీ పునరుజ్జీవ చివరికాలం నాటికి కాని నిజమైన శాస్త్రీయ స్ఫూర్తి వృద్ధి చెందలేదు.



© SCERT not to be republished

రోజర్ బాకాన్ తరవాత చాలా కాలానికి నికొలస్ కోపర్నికస్ (1473-1543) అన్న పోలిష్ ఖగోళ శాస్త్రవేత్త శాస్త్రీయ పద్ధతిని ఉపయోగించుకున్నాడు. అతడు ఒక వేధశాల (ఖగోళ పరిశోధకశాల)ను స్థాపించి ఓపికగా ఆకాశాన్ని అధ్యయనం చేయసాగాడు. అప్పటివరకు వ్యాప్తిలో ఉన్న విశ్వ సిద్ధాంతం తప్పన్న నిర్ధారణకు వచ్చాడు. టోలమీ ప్రతిపాదించిన భూమి విశ్వానికి కేంద్రంగా ఉండి నక్షత్రాలు, సూర్యుడు, గ్రహాలు దానిచుట్టూ తిరుగుతున్నాయన్న సిద్ధాంతాన్ని అందరూ నమ్ముతున్న రోజులవి. సూర్యుడి చుట్టూ తిరుగుతున్న అనేక గ్రహాలలో భూమి కూడా ఒకటని కోపర్నికస్ చెప్పాడు. బైబిలు, చర్చి బోధనలకు విరుద్ధంగా ఉందని ఈ కొత్త సిద్ధాంతాన్ని చర్చి తిరస్కరించింది. మనిషి కోసం చేసిన విశ్వానికి అతడు కేంద్రంగా లేకపోవటంతో అతడి హెూదా పోతుందని చర్చి భావించింది.


*చిత్రం 12.3: సూక్ష్మదర్శిని సహాయంతో విశ్వానికి సంబంధించిన సిద్ధాంతాన్ని వివరిస్తున్న గెలీలియో.*


ఇటలీ దేశానికి చెందిన గెలీలియో (1564-1642) అన్న మేధావి సూక్ష్మదర్శినికి మెరుగులు దిద్దాడు. దీనితో యాభై మైళ్ల దూరంలో ఉన్న ఓడ అయిదు మైళ్లు దూరాన ఉన్నంత స్పష్టంగా కనిపించేది. ఈ పరికరం ఖగోళశాస్త్ర అధ్యయనానికి సైతం తోడ్పడింది. గెలీలియో బాగా రాస్తాడు, చక్కగా ఉపన్యాసాలిస్తాడు కాబట్టి విస్తృత ప్రజాదరణ పొందాడు. కోపర్నికస్ సిద్ధాంతాలను చర్చిస్తూ జ్యుపిటర్ ఉపగ్రహాలను, ఆ గ్రహ పరిభ్రమణాన్ని తాను స్వయంగా చూసిన విషయం శ్రోతలకు చెప్పేవాడు. అతడి కృషికి అతడిని చర్చి న్యాయస్థానంలో హాజరు పరిచి అతడి బోధనలన్నింటినీ వెనక్కి తీసుకోమని ఆదేశించారు. లేని పక్షంలో చిత్రహింసలకు, దీర్ఘకాల ఖైదుకి గురి కావలసి ఉంటుందని హెచ్చరించారు. "భూమి కదలికలను నేను చూశాను," అని గొణుక్కుంటూ విచారణ స్థలం నుంచి బయటకు వచ్చాడని చెబుతారు. లోలకంలోని సిద్ధాంతాలను గెలీలియో కనుగొనటంతో మరింత మెరుగైన గడియారాలు తయారు చేయగలిగారు. పీసాలో వాలి ఉన్న భవన శిఖరంనుంచి చేసిన ప్రయోగంలో బరువైన వస్తువులు, తేలికైన వస్తువులు ఒకే వేగంతో కిందకు పడతాయని అతడు నిరూపించాడు.

- పునరుజ్జీవన కాలంనాటి ప్రముఖ శాస్త్రవేత్తలు ఎవరు? విజ్ఞాన శాస్త్రానికి వాళ్లు చేసిన కృషి ఏమిటి?

## సముద్ర మార్గాల అన్వేషణ

పునరుజ్జీవన కాలంలో ఐరోపావాసులు తమ పరిమిత భూగోళశాస్త్ర విజ్ఞానాన్ని విస్తరించుకున్నారు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. నావికులకు తాము ఏ దిశలో వెళుతున్నారో, ఎక్కడ ఉన్నారో తెలియచేసే దిక్సూచి, ఆస్ట్రోలేబోలను కనుగొన్నారు. ఓడలను మెరుగుపరిచి సముద్రయానానికి మరింత అనువుగా తయారుచేశారు. తాము సముద్రంలో చాలా దూరం వెళితే భూమి అంచునించి కిందకి పడిపోతామని కొందరు నావికులు భయపడేవాళ్లు. నావికుల మార్గదర్శనానికి మెరుగైన పటాలు కూడా తయారయ్యాయి. 1453 సంవత్సరంలో కాన్‌స్టాంటినోపుల్ తురుష్కుల చేతుల్లోకి వెళ్లటంతో పశ్చిమ,

© SCERT not to be republished




పటం 2: భౌగోళిక అన్వేషణలు

తూర్పు ప్రాంతాల మధ్య వాణిజ్యమార్గాలు మూసుకుపోయాయి. వీటన్నిటి కారణాల వల్ల భూగోళ, కొత్త సముద్రమార్గాల అన్వేషణలో ఆసక్తి, కొన్ని సందర్భాలలో ఉత్సాహం సైతం వ్యక్తమయ్యాయి.

భౌగోళిక అన్వేషణలో పోర్చుగల్, స్పెయిన్‌లకు చెందిన నావికులు ముఖ్యమైన పాత్ర పోషించారు. పోర్చుగల్ నావికుడైన ప్రిన్స్ హెన్రీ ఆఫ్రికా పశ్చిమ తీరానికి కొత్త సముద్ర మార్గాన్ని కనుగొన్నాడు. చివరికి పోర్చుగల్‌కి చెందిన బార్థొలొమ్యి డియాజ్ అన్న నావికుడు ఆఫ్రికాకి దక్షిణ భాగమైన గుడ్ హోప్ అగ్రం దాటి వెళ్లాడు. వాస్కోడగామా సముద్రంలో ఆఫ్రికాను చుట్టుముట్టి 1498లో భారతదేశంలోని కాలికట్‌ని చేరుకున్నాడు. విశాలమైన ఆఫ్రికా ఖండం చుట్టూ సముద్రయానం చేసి చివరికి భారతదేశం చేరుకోగలిగాడు.

తూర్పు వైపుగా సముద్ర మార్గాన్ని కనుగొనాలన్న కృతనిశ్చయంతో క్రిస్టఫర్ కొలంబస్ ఉన్నాడు. ఆసియా తూర్పు తీరాలు అట్లాంటిక్ సముద్రాల ఆవల ఉన్నాయని అనుకున్న అతడు మూడు చిన్న ఓడలలో ప్రయాణమయ్యాడు. సుదీర్ఘ ప్రమాదకరమైన సముద్రయానం తరవాత 1492 అక్టోబరు 12న కొలంబస్ ఒక దీవిని చేరుకున్నాడు. భారతదేశానికి తూర్పువైపుకి చేరుకున్నానని అతడు అనుకున్నాడు. అందుకని ఆ ప్రజలను ఇండియన్స్ అన్నాడు. ఇటలీకి చెందిన అమెరిగొ వెస్పూచి అన్న నావికుడు కొలంబస్‌ని అనుసరించి వెళ్లాడు. కొలంబస్ కనుగొన్నది ఆసియా కాదని పూర్తిగా కొత్త ప్రపంచమని (అమెరికా) అతడు నిర్ధారించాడు.

స్పెయిన్ రాజు చార్లెస్ × సహాయంతో ఫెర్డినాండ్ మాజిల్లాన్ అనే స్పెయిన్ నావికుడు ఓడలో ప్రపంచాన్ని చుట్టుముట్టి వచ్చాడు. అతడు అట్లాంటిక్ మహాసముద్రాన్ని దాటి, దక్షిణ అమెరికా దక్షిణ అంచు చుట్టూ వెళ్లి జలసంధులను దాటుతూ పసిఫిక్ మహాసముద్రంలోని ఫిలిప్పైన్స్ దీవులను చేరుకున్నాడు. సముద్రమార్గాల అన్వేషణలో ఈ ప్రయాణం ఓ మైలు రాయి వంటిది.

- పక్క పేజీలో పటం చూసి సముద్ర మార్గాలలో వివిధ అన్వేషణల జాబితా తయారు చేయండి.

## పద్నాల్గవ శతాబ్దం యూరపులో 'పునరుజ్జీవనం' జరిగిందా?

ఇప్పుడు 'పునరుజ్జీవనం' అన్న భావనను చూద్దాం. ఈ కాలాన్ని గతంతో పూర్తిగా తెగతెంపులు చేసుకుని గ్రీకు, రోమన్ సాంప్రదాయాలనుంచి భావనలు మళ్లీ పుట్టాయని అనుకోవచ్చా? అంతకు ముందుకాలం (12, 13వ శతాబ్దాలు) అంధ యుగం లాంటివా?

ఈ కాలానికీ, అంతకు ముందు కాలానికీ తేడాలను బక్‌హార్ట్ 'పునరుజ్జీవనం' అన్న పదాన్ని ఉపయోగించటం వల్ల ఎక్కువ చేసి చూపాడన్న అభిప్రాయాన్ని ఇంగ్లాండుకి చెందిన పీటర్ బర్క్ వంటి రచయితలు వ్యక్తపరుస్తున్నారు. ఈ కాలపు పండితులు, కళాకారులు క్రైస్తవ ప్రాపంచిక దృక్పథానికి బదులుగా క్రీస్తు పూర్వ ప్రాపంచిక దృక్పథాన్ని అవలంబించారని, గ్రీకు, రోమన్ నాగరికతలు తిరిగి జన్మనెత్తాయని 'పునరుజ్జీవనం' అన్న పదం తెలియచేస్తుంది. ఈ రెండు వాదనలలోనూ కొంత అతిశయోక్తి ఉంది. అంతకు ముందు శతాబ్దాల పండితులకు కూడా గ్రీకు, రోమను సంస్కృతులతో పరిచయం ఉంది. ప్రజల జీవితాలలో మతం ముఖ్యమైన పాత్రనే కొనసాగించింది.

మధ్యయుగాలు అభివృద్ధిలేమితో అంధకారంలో ఉన్నాయని, అందుకు విరుద్ధంగా పునరుజ్జీవనకాలంలో కళా సృజనాత్మకత, గతిశీలతలతో వెల్లివిరిసింది అనే విషయాలను సరళీకరించటమే అవుతుంది. ఇటలీలోని పునరుజ్జీవనంతో ముడిపడిన అనేక అంశాల మూలాలు 12, 13వ శతాబ్దంలో ఉన్నాయి. కొంతమంది చరిత్రకారులు తొమ్మిదవ శతాబ్ద ఫ్రాన్స్‌లో ఇదేవిధంగా సాహిత్యం, కళలు వెల్లివిరిశాయని పేర్కొంటారు.

ఈ కాలంలో యూరపులో సంభవించిన సాంస్కృతిక మార్పులను కేవలం పురాతన రోము, గ్రీకు నాగరికతలు మాత్రమే ప్రభావితం చేయలేదు. పురావస్తు తవ్వకాలు, సాహిత్యంలో రోమన్ సంస్కృతి బయట పడటంతో ఆ నాగరికత పట్ల ఎంతో ఆరాధనా భావం కలిగింది. కానీ గ్రీకులు, రోమన్లకు తెలిసినదానికంటే సాంకేతిక విజ్ఞానం, నైపుణ్యాలు ఆసియాలో ఎంతో ముందుకు వెళ్లాయి. ప్రపంచంలో చాలావరకు పరస్పర సంబంధాలు ఏర్పడ్డాయి. నౌకాయానంలో కొత్త సాంకేతిక విజ్ఞానం వల్ల ఇంతకు ముందుకంటే ఎక్కువ దూరాలు సముద్రాల మీద ప్రయాణించగలుగుతున్నారు. ఇస్లాం విస్తరించటం, మంగోలుల విజయాలతో ఆసియా, ఉత్తర ఆఫ్రికాలకు యూరపుతో రాజకీయంగా కాదు కానీ వ్యాపారం, నైపుణ్యాలను నేర్చుకోవటంలో సంబంధాలు ఏర్పడ్డాయి. యూరపువాసులు కేవలం గ్రీకులు, రోమన్లనుంచే కాకుండా భారతీయులు, అరేబియన్లు, ఇరానియన్లు, మధ్య ఆసియా, చైనీయులనుంచి కూడా నేర్చుకున్నారు. ఈ మూలాలకు ఇప్పటివరకు ఎవరూ ప్రాధాన్యత ఇవ్వలేదు. ఎందుకంటే చరిత్ర రాయటం మొదలుపెట్టినప్పుడు చరిత్రకారులు దానిని యూరపు దృష్టికోణం నుంచి చూశారు.

ఈ కాలంలో జరిగిన మరొక ముఖ్యమైన మార్పు జీవితాలలో 'ప్రజా', 'వ్యక్తిగత' రంగాలు వేరుకాసాగాయి. 'ప్రజా' రంగం అంటే ప్రభుత్వం, వ్యవస్థీకృత మతం అన్న అర్థాన్ని సంతరించుకుంది. 'వ్యక్తిగత' రంగం అంటే కుటుంబం, వ్యక్తిగత మతంగా పరిగణింపబడసాగింది. ప్రతి వ్యక్తికి వ్యక్తిగత, ప్రజా పాత్రలు రెండూ ఉన్నాయి. వ్యక్తి కేవలం 'మూడు వ్యవస్థలలో' సభ్యుడు మాత్రమే కాదు అతడు పూర్తి హక్కు కలిగిన మూర్తిమత్వం కలిగినవాడు కూడా. కళాకారుడు కేవలం ఒక సంస్థలో సభ్యుడు మాత్రమే కాదు, అతడు వ్యక్తిగతంగా కూడా ఖ్యాతి పొందాడు. 18వ శతాబ్దంలో వ్యక్తి అన్న భావన రాజకీయ రూపంలో కూడా వ్యక్తం అయ్యింది. వ్యక్తులందరికీ సమాన రాజకీయ హక్కులు ఉన్నాయన్న భావనను ఇది కలిగించింది.

యూరపులోని మరొక పరిణామం భాష ఆధారంగా విభిన్న ప్రాంతాలు వేరువేరు గుర్తింపులు పొందనారంభించాయి. అంతకు ముందు రోమన్ సామ్రాజ్యం ద్వారా, ఆ తరవాత లాటిన్, క్రైస్తవ మతం ద్వారా కొంతవరకు ఏకీకృతమైన యూరపు ఇప్పుడు భాషద్వారా ఏకత్వం కలిగిన జాతీయ రాజ్యాలుగా విడిపోసాగింది.

**కీలక పదాలు**


1. ఫ్యూడలిజం
2. కట్టు బానిసలు
3. పునరుజ్జీవనం
4. మానవతావాదం
5. వాస్తవికతావాదం
6. సంస్కరణలు
7. ప్రొటెస్టెంట్

©SCERT not to be republished

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. ఈ అధ్యాయంలో పునరుజ్జీవనంపై చర్చ ప్రధానంగా ........................ (ఇంగ్లాండు/ ఇటలీ/ ఫ్రాన్స్/ జర్మనీ)
2. పునరుజ్జీవన కాలంలో కింద పేర్కొన్న భావనలలో వచ్చిన మార్పుల గురించి ఒక పదం లేదా ఒక వాక్యంతో రాయండి.
   అ. మానవతావాదులు: ........................ నుంచి ........................ వరకు
   ఆ. పుస్తకాలు: ........................ నుంచి ........................ వరకు
   ఇ. చిత్రకళలు: ........................ నుంచి ........................ వరకు
   ఈ. మానవులు: ........................ నుంచి ........................ వరకు
   ఉ. మహిళలు: ........................ నుంచి ........................ వరకు
3. బైబిలును ముద్రించడం ద్వారా దేవుడు, చర్చిపై భావనలు ఎలా ప్రభావితం అయ్యాయి?
4. మధ్యకాలంనాటి ఇటలీ నగరాలను ప్రస్తుత ఇటలీ నగరాలతో పోల్చండి. వాటి ప్రస్తుత పేర్లలో ఏమైనా తేడాలు ఉన్నాయా?
5. 14, 15వ శతాబ్దాలలో గ్రీకు, రోమను సంస్కృతులలో ఏ అంశాలను పునరుద్ధరించారు?
6. మానవతావాద భావనలు ఇటలీలోని పట్టణాలను ముందుగా ఎందుకు ప్రభావితం చేశాయి?
7. మానవతావాద ఆలోచనల్లోని అంశాలు ఏమిటి?
8. పక్కన ఉన్న పట్టిక పుస్తకాల ముద్రణలో వృద్ధి గురించి చెబుతుంది. దాని గురించి ఏం చెప్పగలరు?
9. "ముద్రింపబడిన పుస్తకాలు మన జీవితాలలో ఇంకా ప్రముఖ పాత్రను పోషిస్తున్నాయి" అన్న వాక్యంతో మీరు ఏకీభవిస్తారా? మీ సమాధానానికి కారణాలు తెలపండి.
10. 17వ శతాబ్దపు ఐరోపావాసులకు ప్రపంచం ఎలాగ భిన్నంగా అనిపించి ఉంటుందో వివరించండి.
11. పునరుజ్జీవన కాలం నాటి భవన నిర్మాణంలో రెండు ముఖ్యమైన అంశాలను చెప్పండి.

1450–1800 మధ్య కాలంలో యూరప్‌లో ప్రచురితమైన పుస్తకాలు




© SCERT not to be republished

## ప్రాజెక్టు

1. పునరుజ్జీవన కాలంనాటి ప్రముఖ కళాకారుల చిత్రాలను సేకరించి, వాటిని ఒక పుస్తకంలో అంటించండి.
2. సూర్యుడి చుట్టూ భూమి తిరగటం లేదని నమ్మే మతగురువుకి, గెలీలియోకి మధ్య సంభాషణను ఊహించి రాయండి.
3. ముద్రణ యంత్రం నుంచి వచ్చే వివిధ ఉత్పత్తులను మనం ఏ ఏ విధాలుగా వాడుతున్నామో తెలియచేస్తూ ఒక నివేదిక తయారు చేయండి.